క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

షాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏబీవీ వైద్యశాల వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 120 మంది గ్రామస్తులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం సిబ్బంది వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ సిబ్బంది శిరీష, రమేశ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



బోనాలతో మహిళలు

షాబాద్: మండలంలోని హైతాబాద్ గ్రామంలో మంగళవారం మల్లన్న బోనాలు, కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం గ్రామస్తులు బీరప్పస్వామికి సుక్క బోనంతో నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూద యాదయ్య, మాజీ సర్పంచ్ ర్యాకల శేఖర్, నాయకులు ఆంజనేయులు, చర్ల నర్సింలు, కుమార్, రాజుగౌడ్, శేఖర్, శంకర్, శివ, శేఖర్, అనిల్ తదితరులు ఉన్నారు.

కళాశాల నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న జగదీశ్వర్

షాద్‌నగర్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి విశ్రాంత తహసీల్దార్ సరాపు జగదీశ్వర్ మంగళవారం రూ.1లక్ష రూపాయల విరాళాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగదీశ్వర్ విరాళానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, అప్పి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుడిగా జంగయ్య



కార్మికుడిని సన్మానిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుడిగా చౌదరిగూడ గ్రామ కార్మికుడు జంగయ్యను ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్మికులందరూ జంగయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ హన్మంతురెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాండురంగన్‌గౌడ్, టీఏ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘంలో చేరాలి

ఏపీఎం జయమాలిని

కొందుర్గు: ప్రతి మహిళా స్వయం సహాయక సంఘంలో చేరాలని మండల మహిళా సమాఖ్య ఏపీఎం జయమాలిని సూచించారు. మంగళవారం మండలంలోని ముట్పూర్‌లో ఇటీవల వివాహం అయిన మహిళలను గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు కుమ్మరి సత్యమ్మ ఆధ్వర్యంలో బొట్టుపెట్టి సంఘంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటివరకు 108 మంది మహిళలకు కొత్తగా సంఘాల్లో చేర్పించామని తెలిపారు. మరో 300 మంది వరకు కొత్తగా చేరే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళా సంఘంలో సభ్యత్వం తీసుకొని ప్రభుత్వ పథకాలకు అర్హత పొందాలని సూచించారు. కార్యక్రమంలో వీఓఏ మాధవి పాల్గొన్నారు.

అటకెక్కిన ‘అమ్మఒడి’

- గర్భిణులకు అందని నగదు ప్రోత్సాహకాలు, బేబీకేర్ కిట్లు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బాలింతలు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: ఆరోగ్యకరమైన సమాజ స్థాపనలో భాగంగా ప్రభుత్వాలు వైద్యశాఖను బలోపేతం చేస్తున్నాయి. అంతేకాకుండా మాతాశిశు మరణాలను తగ్గించి నాణ్యమైన వైద్యం అందించేందుకు వీలుగా ప్రతీ మండల కేంద్రంలోని పీహెచ్‌సీల్లో గర్భిణులు, బాలింతలకు అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను పెంచి తల్లీబిడ్డలకు సకాలంలో వైద్యం అందించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమ్మఒడి పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా గర్భిణులు సంబంధిత పీహెచ్‌సీలో తమ పేరును నమోదు చేసుకొని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన వారికి నగదు, బేబీకేర్ కిట్లను అందించింది. పథకం అమలు తీరు బాగుండడంతో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం కంటే ఎక్కువగా ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగాయి. కాగా ఈ పథకం పలు కారణాలతో గత రెండేళ్ల నుంచి సక్రమంగా అమలుకావడం లేదు.

బయట కొనుగోలు చేస్తున్న వైనం..

గత రెండేళ్ల నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగిన మహిళలకు నగదు, బేబీకేర్ కిట్లు అందడం లేదు. అప్పటి బీఆర్‌ఎస్ పథకం అమలు చేసిన అమ్మఒడి పథకానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎంసీహెచ్(మదర్ చైల్డ్ హెల్త్)గా పేరు మార్చింది. అప్పట్లో కేసీఆర్ కిట్‌ను ఇవ్వగా ప్రస్తుతం ఎంసీహెచ్ కిట్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కాగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగిన వారికి నగదు, బేబీకేర్ కిట్లు అందకపోవడంతో వారు బయట నుంచి వేలు ఖర్చు చేసి కొనుగోలు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకునేవారు తమ పిల్లల పోషణ, ఆరోగ్యం కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో అప్పట్లో అమ్మఒడి పథకంలో భాగంగా చిన్నారులకు 16 రకాల వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్‌ను అందించారు. ఈ కిట్ విలువ బయట మార్కెట్‌లో సుమారు 2 వేల వరకు ఉంటుంది. దీంట్లో దోమతెర, దుస్తులు, టవల్స్, న్యాప్‌కిన్స్, బేబీ పౌడర్, బేబీ సోప్, బేబీ ఆయిల్, సోప్ బాక్స్, ఆట వస్తువులు, ప్రసవించిన తల్లికి రెండు చీరలు, ఒక చిన్న కిట్‌బ్యాక్‌తో పాటు పలు వస్తువులు ఉండేవి. ప్రస్తుతం ప్రభుత్వం ఇవ్వకపోవడంతో వారే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



కొత్తూరు పీహెచ్‌సీ



ఆస్పత్రిలో పరీక్షల నిమిత్తం వచ్చిన రోగులు, మహిళలు (ఫైల్)

అందని నగదు ప్రోత్సాహకం

పేరు నమోదైన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవిస్తే మగ పిల్లాడైతే 12 వేలు, ఆడపిల్ల పుడితే 13 వేలు ఈ పథకం ద్వార మూడు విడతలుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బాలింతలకు అందించారు. గర్భిణులు మొదటగా ఆస్పత్రికి వచ్చిన తర్వాత పరీక్షలు చేయించుకున్న అనంతరం తమ పేరును అమ్మఒడి పథకంలో రిజిస్టర్ చేయించుకోవాలి. అప్పుడే సిబ్బంది వారి బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ కార్డు నెంబరు తీసుకుంటారు. ఆస్పత్రిలో వారు రెండు సార్లు వైద్యురాలితో పరీక్షలు చేయించుకున్న తర్వాత వారి ఖాతాలో మొదటి విడతగా 2 వేలు జమ చేస్తారు. తర్వాత ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవిస్తే పిల్లలకు మొదటి విడత టీకాలు ఇచ్చిన తర్వాత ఆడపిల్ల అయితే 5 వేలు, మగ పిల్లాడైతే 4 వేలు జమ చేస్తారు. శిశువుకు మూడున్నర, నాలుగు నెలల వయస్సులో ఇచ్చే టీకాల తర్వాత 2 వేలు, 9 నెలల వయస్సులో ఇచ్చే టీకాల తర్వాత 3 వేలు వారి ఖాతాలో జమ చేస్తారు. ఇలా మూడు విడతలుగా ఆడపిల్ల పుడితే 13, మగపిల్లాడు పుడితే 12 వేలు వారి ఖాతాలో జమ చేస్తారు. కాగా పలు కారణాలతో వీరికి ప్రస్తుతం నగదు అందడం లేదు.

నగదు, కిట్లు అందలేదు

గతేడాది అక్టోబర్ 1వ తేదీన కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నాకు ప్రసవం జరిగింది. కాగా ఏడాది గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి నగదు ప్రోత్సాహకం, బేబీకేర్ కిట్లు మాత్రం రాలేదు. దీంతో వేలు ఖర్చు చేసి బయట కొనుగోలు చేయాల్సి వచ్చింది.

– కమలాదేవి, కొత్తూరు

వివరాలు అధికారులకు పంపుతున్నాం



ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే వారికి గతేడాది నుంచి సక్రమంగా నగదు, బేబీకేర్ కిట్లు అందడం లేదని తెలిసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే వారి వివరాలను సిబ్బంది ఎప్పటికప్పుడూ ఉన్నతాధికారులకు పంపుతున్నారు. కాగా ప్రసవాలు జరిగిన వారే ఆస్పత్రికి వచ్చి తమకు నగదు రాలేదని అడుగుతున్నారు.

– హరికిషన్, పీహెచ్‌సీ వైద్యుడు, కొత్తూరు

పనులు త్వరగా పూర్తిచేసేందుకు కృషి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



బైపాస్ రోడ్డు చదును చేసే పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు పనులు త్వరగా పూర్తిచేసేలా కృషి చేస్తానని చెప్పారు. ముందుగా భూసేకరణ చేపట్టిన రూట్ మ్యాప్‌ప్రకారం బైపాస్‌లలో చదును చేస్తున్నారన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. త్వరలోనే ఈరోడ్డు పనులు పూర్తవుతాయని చెప్పారు. బైపాస్ రోడ్లు క్లియర్ అయితే కొంతమేర మండల కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.రాములు, నాయకులు ఆగిరెడ్డి, మధుసూదన్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి, గంగి యాదయ్య, ప్రభాకర్‌రెడ్డి, నరేందర్, చాన్‌పాషా, జనార్ధన్ , సత్యనారాయణ, మధుసుధన్‌రెడ్డి, సాయి, చోటు తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

మండల కేంద్రంలో జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య పరిశీలించారు. స్థానిక నాయకులు డీ.వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, యాదయ్య, వీరేందర్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తాలతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

సొంత నిధులతో గుంతల పూడ్చివేత



రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న ప్రవీణ్‌చారి అతని స్నేహితులు

చేవెళ్ల: అందరిలా పుట్టిన రోజు వేడుకలను స్నేహితులతో కలిసి కేక్ కట్‌చేసి వేడుకలు చేసుకోకుండా ఓ యువకుడు వినూత్నంగా ఆలోచన చేసి నలుగురికి ఉపయోగపడేలా సామాజిక సేవా కార్యక్రమాన్ని చేటపట్టాడు. మంగళవారం చేవెళ్లకు చెందిన అవుసుల ప్రవీణ్‌చారి తన జన్మదినం సందర్భంగా హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ఏర్పడిన ప్రమాదకర గుంతలను సొంత డబ్బులు వెచ్చించి రీబీటీ కాంక్రీట్ సహాయంతో పూడ్చివేయించాడు. తన స్నేహితులు, ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించి చేవెళ్ల నుంచి మీర్జాగూడ వరకు రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేసే పనులు మొదలుపెట్టాడు. ఈ సందర్భంగా స్థానికులు, వాహనదారులు అతనిని అభినందించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌చారి స్నేహితులు,ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు



అన్నదాత ప్రభాకర్‌యాదవ్ దంపతులను సన్మానిస్తున్న గురుస్వామి

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మాలదారులకు మంగళవారం నర్సప్పగూడకు చెందిన కావలి ప్రభాకర్‌యాదవ్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి గురుస్వామి గిరిషన్‌నాయర్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ.. మాలదారులకు అన్నదానం చేయడం చాలా పుణ్యఫలమన్నారు. అనంతరం అన్నదాత దంపతులను గురుస్వామి సన్మానించారు.

ఝాన్సీలక్ష్మీబాయి పోరాటం ఆదర్శం

- ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న సూర్యప్రకాశ్, నాయకులు

షాబాద్: ఝాన్సీ లక్ష్మీబాయిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్ అన్నారు. ఏబీవీపీ షాబాద్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీఆర్‌ఆర్ స్టేడియంలో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య సమరంలో వీరోచిత పోరాటం చేసి ఒంటి చేతితో 14 మందిని మట్టిపెట్టిన వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి అని తెలిపారు. ఆమె పోరాటం అందరికీ ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర అధ్యక్షుడు యాదయ్య, నగర కార్యదర్శి పద్మశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, కిరణ్, మధు, భవదీప్, ప్రేమ్‌కుమార్, సాయి, విష్ణు, ఆయా పాఠశాలల విద్యార్థులు తదితరులు ఉన్నారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

వాసవి క్రౌన్ స్టార్ కేసీజీఎఫ్ అశోక్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: సమాజాభివృద్ధికి వాసవి క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని వాసవి క్రౌన్‌స్టార్ కేసీజీఎఫ్ పిప్పళ్ల అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రామలింగేశ్వరస్వామి సహకార సంఘ భవనంలో వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ గుగ్గిళ్ల స్వాతిబాలరాజేశ్ ఆధ్వర్యంలో రీ కాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అశోక్‌కుమార్ హాజరై రీజియన్ పరిధిలోని వాసవి క్లబ్‌లు చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను పరిశీలించారు. వాసవి, వనితా క్లబ్‌లు చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ ఆయా క్లబ్‌ల అధ్యక్షులను అభినందించారు. క్లబ్ చేపట్టిన సేవలకు గుర్తింపుగా ఉత్తమ ప్రెసిడెంట్ పతకాలను అందజేశారు. ఫస్ట్ బెస్ట్ క్లబ్ ప్రెసిడెంట్‌గా గుడిపల్లి వెంకటరమణ(షాద్‌నగర్), సెకండ్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా గుడిపల్లి రవికుమార్(షాద్‌నగర్), థర్డ్ బెస్ట్ ప్రెసిడెంట్ వాసవి, వనితా క్లబ్ అధ్యక్షురాలు కొండ రమ(కాటేదాన్, శివరాంపల్లి)కు పతకాలను అందజేశారు. ఫస్ట్ బెస్ట్ సెక్రటరీగా ఎంబీఏ సురేశ్‌కుమార్(షాద్‌నగర్), సెకండ్ బెస్ట్ సెక్రటరీ కల్వ పుష్పాంజలి(షాద్‌నగర్), థర్డ్ బెస్ట్ సెక్రటరీగా రవికుమార్(కాటేదాన్)కు పతకాలను అందజేశారు. ఫస్ట్ బెస్ట్ ట్రెజరరీగా కల్వమాణిక్యం(షాద్‌నగర్), సెకండ్ బెస్ట్ ట్రెజరరీగా స్వప్న(షాద్‌నగర్), రాజు(శివరాంపల్లి)కు పతకాలను అందజేశారు. అనంతరం పిప్పళ్ల అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. నిరుపేదల అభివృద్ధికి వాసవి, వనితా క్లబ్‌లు సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. పేదల ఉపాధికి సాయాన్ని అందించి వారికి ఆర్థిక భరోసాను కల్పించడం హర్షణీయమన్నారు. సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లో మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ సూరిశెట్టి నర్సింహ, కార్యదర్శి వాడకట్టు విజయకుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ అనంతం, ఎలుకుర్తి శ్రీనివాస్, పాలాది వెంకటరమణ, గార్లపాటి నవీన్‌కుమార్, శ్రీనివాస్, యంసాని శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, ఉప్పల శ్రీనివాస్, పెండ్యాల జగదీశ్వర్, కట్ట ప్రవీణ్, బాదం మాధవి, బండారి శ్యామల, బండారి ఆనంద్, గుంత సత్యనారాయణ, రంగ రాజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్



పూజలో చైర్మన్ నరేందర్, నాయకులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. కార్తీక మాసం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయక గంజ్‌లో ఉన్న గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గందె సురేశ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం నరేందర్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వన్నాడ వెంకటేశ్‌గౌడ్, సుజీవన్, అనిల్, శేఖర్‌రెడ్డి, గజవాడ నర్సింలు, కోటి లింగంగౌడ్, అభిలాశ్, గోపాల్, ప్రవీణ్, శ్రీధర్, ఆలయ ట్రస్టు సభ్యులు శంకర్‌లాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో మంగళవారం దేశ మాజీ దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, కాలె యాదయ్యలు కొనియాడారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు



కొత్తూరు: ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు



కేశంపేట: మండల కేంద్రంలో..



చేవెళ్లలో..

గ్రామాభివృద్ధికి సహకరించండి

ఎంపీ డీకే అరుణకు వినతి



ఎంపీ డీకే అరుణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మహేశ్

కేశంపేట: గ్రామాభివృద్ధికి నిధులు అందించి సహకరించాలని మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన కంచుకోట మహేశ్ మంగళవారం ఎంపీ డీకే అరుణను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సీసీరోడ్ల నిర్మాణాలకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సోలార్ వీధి లైట్ల ఏర్పాటుకు నిధులు అందించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరినట్టు మహేశ్ తెలిపారు. ఈ విషయంపై ఎంపీ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఉద్యమకారుల మండల కమిటీ ఎన్నిక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉద్యమకారులు

కేశంపేట: మండల కేంద్రంలో ఉద్యమకారులు మంగళవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యమకారుల సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌తో పాటు నియోజకవర్గ అధ్యక్షుడు, ఫరూఖ్‌నగర్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పంది వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా లాలమోని చంద్రయ్య, అధ్యక్షుడిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా యాదగిరి, నసీరుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా నక్క చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా శేఖర్, జంగయ్య, కోశాధికారిగా కందాడ లక్ష్మయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా మనోహర్‌తో పాటు జంగయ్య, మురళీమోహన్, భాస్కర్, జైపాల్‌రెడ్డి, కంచుకోట దశరథం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీశైలం



బోరును ప్రారంభిస్తున్న శ్రీశైలం తదితరులు

నందిగామ: గ్రామస్తుల సంక్షేమమే తన ప్రధాన ధ్యేయమని, వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సాధ్యమైనంత వరకు తీర్చేందుకు ప్రయత్నిస్తానని కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు మంకాల శ్రీశైలం అన్నారు. మండల పరిధిలోని చేగూరు 8వ వార్డులో ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలిసిన అదే గ్రామానికి చెందిన మంకాల శ్రీశైలం తన సొంత డబ్బుతో బోరు వేయించి, బోరు మోటారు బిగించారు. ఈ బోరును మంగళవారం ప్రాంభించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. వార్డు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రూ.1లక్ష 50 వేలు హెచ్చించి బోరు వేయించి మోటారు బిగించానని చెప్పారు. దీంతో ఆ వార్డులో నీటి సమస్య తీరిందన్నారు. అనంతరం వార్డు ప్రజలు శ్రీశైలంను అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుధాకర్, అక్షయ్, జశ్వంత్, బాలు, పవన్, శ్యాంసుందర్, యాదయ్య, నర్సింహ, భీమయ్య, భిక్షపతి, శంకర్, రమేశ్, కృష్ణ, శివ, శ్రీనివాస్, మహేశ్, శ్రీశైలం, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.